లిటిల్ ప్రిన్సెస్ ‘చిహ్నిక’

- మోడలింగ్‌లో రాణిస్తున్న ఏడేళ్ల చిన్నారి
- అంతర్జాతీయ వేదికపై పతకాల పంట
- మల్టీ టాలెంటెడ్ కిడ్‌గా ప్రశంసల జల్లు





ఆంధ్రా ఫ్యాషన్ వీక్ 2024 మొదటి సీజన్ విజేతగా..



పతకాలు, బహుమతులతో చిహ్నిక

గాజువాక : ఏడేళ్ల చిన్నారి మోడలింగ్‌లో అదరగొడుతోంది. వేదిక ఏదైనా విజయానికి చిరునామాగా నిలుస్తోంది. జాతీయ స్థాయి పోటీలైనా, అంతర్జాతీయ వేదికైనా విజయాన్ని సొంతం చేసుకుని న్యాయ నిర్ణేతలను సైతం ఆశ్చర్యపరిచేలా విశేష ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తోంది. థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గాజువాకకు చెందిన ఈ లిటిల్ ప్రిన్సెస్ అనేక రంగాల్లో ప్రతిభ కనబరిచి మల్టీ టాలెంటెడ్ కిడ్‌గా రాణిస్తోంది. చిహ్నిక గాజువాకలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. తండ్రి రాజేష్ కుమార్ లారస్ ల్యాబ్‌లో, తల్లి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)లో పని చేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిహ్నిక మోడలింగ్ రంగంలో రాణిస్తోంది. మోడలింగ్‌తో పాటు కరాటే, వెస్ట్రన్ డ్యాన్స్, శ్లోకాలు చెప్పడం, స్పెల్ బీ వంటి అంశాల్లో ప్రావీణ్యాన్ని సంపాదించి ఆయా పోటీల్లో అనేక టైటిళ్లు, బహుమతులను సొంతం చేసుకుంది.



పతకాల పంట

- కరాటేలో వివిధ స్థాయిల్లో జరిగిన పోటీల్లో స్వర్ణ, రజత పతకాలను సాధించింది.
- యాక్టివ్ 24/7 వైజాగ్ యూత్ కార్నివాల్, డ్యాన్స్ ప్లస్ వైజాగ్ త్రీ పోటీల్లో ఉత్తమ డ్యాన్సర్‌గా బహుమతులు పొందింది.
- క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్ కిడ్స్ కార్యక్రమంలో రన్నరప్‌గా నిలిచింది.
- ఆంధ్రా ఫ్యాషన్ వీక్ 2024లో విజేతగా నిలిచింది. యాక్టివ్ 24/7 సంస్థ నుంచి మల్టీ టాలెంటెడ్ కిడ్‌గా పురస్కారం అందుకుంది.
- జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పేరుతో ఇటీవల కేరళలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి ప్రిన్సెస్ ఆఫ్ ఇండియా టైటిల్‌తో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.
- థాయ్‌లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మోడలింగ్ పోటీల్లో భారతదేశం నుంచి పాల్గొన్న చిహ్నిక సీనియర్ టోడ్లర్ విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ టైటిల్, ఎక్స్‌ట్రీమ్ టాలెంట్, బెస్ట్ ఇంట్రడక్షన్ సబ్ టైటిల్స్‌ను కైవసం చేసుకుంది.

నచ్చిన రంగంలో ప్రోత్సహించాలనే..

చిహ్నిక పుట్టినప్పుడే తనకు ఇష్టమైన రంగంలోకి పంపించాలని నిర్ణయించుకున్నాం. అయితే, చిన్నప్పటి నుంచే ఆమె వివిధ రంగాల్లో ఆసక్తి చూపిస్తుండటం గమనించాం. తనకు నచ్చిన ప్రతీ రంగంలోను అడుగు పెట్టిస్తున్నాం. భవిష్యత్తులో తన ఆసక్తికి అనుగుణంగానే తనను ప్రోత్సహించాలని, తద్వారా తన విజయానికి అండగా నిలవాలని అనుకుంటున్నాం.

– హారిక, చిహ్నిక తల్లి

‘పది’లో ప్రతిభావంతులకు సత్కారం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: గత మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నగదు పారితోషికం అందించింది. విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించింది. అగనంపూడిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ కార్యక్రమాలకు అండగా ఉంటున్న జి.నరసింగరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పినమడక హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయిని కృష్ణవేణి, ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వాసపల్లి వెంకటరమణ, చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. అనకాపల్లి, గాజువాక, సబ్బవరం, లంకెలపాలెం, పరవాడ, గవర్ల అనకాపల్లి, స్టీల్‌ప్లాంటు, దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి అనేక మంది ఆదివారం ఉదయమే తీర ప్రాంతాలకు చేరుకున్నారు. ప్రత్యేకంగా టెంట్లు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఇసుక తిన్నులపై యువత కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.

క్లుప్తంగా

1 నుంచి ఏఐటీయూసీ సమావేశాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అచ్యుతరామయ్య

పెదగంట్యాడ: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను వచ్చేనెల 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరామయ్య తెలిపారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో ఆహ్వాన సంఘం సభ్యులతో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సమావేశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉక్కునగరంలో మూడు రోజుల పాటు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. 3వ తేదీన సమావేశాల ముగింపు సందర్భంగా విశాఖలో సరస్వతి పార్కు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజాబాబు, బి.ఆనంద్, యెల్లేటి శ్రీనివాసరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ కోర్సులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమర్‌రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్(తిరుపతి) సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్ఎస్ఎన్ఆర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు సేఫ్టీ విభాగంలోని పలు అంశాలను వివరించారు. విపత్తుల గుర్తింపు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ విభాగం సీనియర్ మేనేజర్ మాధవ్‌కుమార్, కాలేజీ సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ వరహాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు


శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారం 7వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషపూజలు చేశారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

చిన్నారులకు చెస్ పోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

అల్లిపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వరమెట్ట, శ్రీ గౌరీ సేవా సంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న పిల్లలకు నిర్వహించిన పోటీలకు 33వ వార్డులోని అన్ని స్కూళ్ల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విజేతలకు ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్తర్వుల ప్రకారం వేతనాలు చెల్లించాలి


సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: ప్రభుత్వ ఉత్తర్వులు 36 ప్రకారం భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) కార్మికుల వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు కోరారు. అగనంపూడి బొర్రమాంబ వనం వద్ద ఏర్పాటు చేసిన యూజీడీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్తర్వుల ప్రకారం యూజీడీ కార్మికులకు వేతనం రూ.24,500 చెల్లించాలని, పదవీ విరమణ, అనారోగ్యంతో మృతి చెందడం వల్ల ఏర్పడిన ఖాళీలను తక్షణం వారి కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని, యూజీడీ కార్మికులను అదే స్థానంలో కొనసాగించాలని డిమాండ్‌చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12వ తేదీన జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గొలగాని అప్పారావు, ఎస్.గణేష్, గొల్ల రాము, జె.ఆర్.నాయుడు, ఎన్.నాగరాజు, వై.చిన్నారావు, మీనాక్షి, సత్యవతి, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గాజువాక జోన్ యూజీడీ కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.రఘు, పి.మహేష్, ఉపాధ్యక్షునిగా సీహెచ్ఎస్ నాయుడు, కోశాధికారిగా బి.శివశంకర్, కమిటీ ప్రతినిధులుగా జి.శ్రీను, పి.కోటి ఎన్నికయ్యారు.

76వ వార్డులో శాకాహార సద్భావన ర్యాలీ


ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా అహింసా పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు చేయడం అభినందనీయమని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ధ్యాన కేంద్రం ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని కార్పొరేటర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ర్యాలీ నడుపూరు జంక్షన్ నుంచి అన్ని వీధుల మీదుగా సాగింది. కార్యక్రమంలో నాయకులు పల్లా కార్తీక్, సొసైటీ సభ్యులు రేవతీదేవి, బి.అప్పారావు, కట్టా పద్మ, బాలాజీ, జి.సత్యనారాయణ, భాగ్యగౌరి, భానుమతి, ఉషారాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

కంచరపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నడక పోటీలు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, ఫౌండర్ సూర్యనారాయణ పోటీలు ప్రారంభించారు. జిల్లా స్థాయిలో 4 కేటగిరీల్లో 135 మంది మహిళలు, పురుషులు నడక పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందిస్తామని కార్యదర్శి బలరామ్ తెలిపారు.

అధిక పెన్షన్ చెల్లింపునకు వినతి


ఎంపీ గొల్ల బాబూరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఈపీఎస్–95 సమస్యలు పరిష్కరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కేంద్ర ఈపీఎఫ్‌వో అధికారులను కోరారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ న్యూఢిల్లీలో అధికారులను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 2 వేల మంది రిటైర్డ్, సర్వీసులో ఉన్న ఉద్యోగులు అధిక పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 2023 అక్టోబర్–2024 ఫిబ్రవరి మధ్య అధిక పెన్షన్ కోసం రూ. 500 కోట్లు డిపాజిట్ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు అధిక పెన్షన్ జారీ చేయలేదన్నారు. దురదృష్టవశాత్తు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవోలు జారీ చేసిన తర్వాత కూడా ఇప్పటి వరకు పెన్షన్ పంపిణీ కాలేదన్నారు. ఈ నేపథ్యంలో అధిక పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ ఎంపీలు విజయ్ బాఘేల్, గోడం నగేష్, వైఎస్సార్‌సీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, ఆర్.కృష్ణయ్యలను కలిసి ఈపీఎస్ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు బౌద్ధ మిషన్ క్విజ్ పోటీలు


విజేతలతో బౌద్ధ మిషన్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్విజ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బౌద్ధ మిషన్ స్థాపించి 31 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఉక్కునగరం క్లబ్ ఎంపీ హాల్లో ‘బుద్ధ మరియు బుద్ధిజమ్’ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉక్కునగరానికి చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలో 5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. సీనియర్ కేటగిరీలో డీపీఎస్ పాఠశాల జట్టు మొదటి, ద్వితీయ స్థానాలు సాధించగా, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల జట్టు తృతీయ స్థానం గెలుపొందాయి. సీనియర్ కేటగిరీలో డీపీఎస్ పాఠశాల జట్టు ప్రథమ స్థానం, డీపాల్ పాఠశాల జట్టు రెండో స్థానం, సృష్టి పాఠశాల జట్టు తృతీయ స్థానం గెలుచుకున్నాయి. విజేతలకు సోమవారం బుద్ధ విహార్‌లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నామని బౌద్ధ మిషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరమట సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కుంచే సత్యనారాయణ, అంబటి సత్యనారాయణ, రాంజీ, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం


మహనీయుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న డైరెక్టర్లు, జీఎంలు, నాయకులు

ఉక్కునగరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉక్కునగరం క్లబ్ ఎంపీ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్ర పాండే, డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్, అటవీ ఉత్పత్తులు కార్పొరేట్ సంస్థల్లోకి వెళ్లి పోయాయన్నారు. ఆదివాసీలందరూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడి, సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా అరకుకు చెందిన 10 థింసా బృందాలు నృత్యాలతో అలరించాయి. అంతకు ముందు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న అధ్యక్షత వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎంలు టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్, రవిచంద్రబాబు, నల్లి భాను, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ డాక్టర్ డి.రాధిక, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, నాయకులు ఎస్.సత్యనారాయణ, మోహన్‌బాబు, ఎల్.వి.రమణ, ఎం.గణేష్, పుల్లారావు, కె.వి.రత్నం, బి.డి.నాయక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు భద్రత ఏదీ?

- దువ్వాడ రైల్వేస్టేషన్లో ఆరుబయటే వాహనాలు
- ఏటా పెంచుతున్న పార్కింగ్ ఫీజులు
- తగిన షెల్టర్లు లేక రక్షణ కరువు



దువ్వాడ రైల్వేస్టేషన్ ముఖద్వారం


దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు షెల్టర్లు లేకపోవడంతో వానకు తడుస్తున్న ద్విచక్రవాహనాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏడాదికేడాది వాహనాల పార్కింగ్ ఫీజులు రెట్టింపు చేస్తున్నా, వాహనాల పార్కింగ్ ప్రదేశంలో షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. వాహనాల భద్రతను గాలికి వదిలేసి పార్కింగ్ ఫీజును ఆదాయ మార్గంగా అధికారులు మార్చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

దువ్వాడ రైల్వేస్టేషన్ ద్వారా ఏటా 28లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, స్పెషల్ రైళ్లను విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా దువ్వాడ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు తాకిడి రెట్టింపు అవుతూ వస్తోంది. డెయిలీ పాసింజర్లతో పాటు, రాజమండ్రి, విజయవాడ, విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులు రైల్వేస్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో ద్విచక్రవాహనాలను పార్క్ చేసి ఒకటి రెండు రోజుల్లో తిరిగి వస్తున్నారు. దీంతో పార్కింగ్ షెడ్లు లేకపోయినా వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో విడిచివెళ్తున్నారు.

గాజువాక, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ, పరవాడ, ఎన్టీపీసీ, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి ప్రయాణికులు ద్విచక్రవాహనాలపై దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని, వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రాజమండ్రి వైపు నిత్యం ప్రయాణం చేసే వందలాది మంది డైలీ పాసింజర్లు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు వాహనాలను పార్క్ చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి రోజుకు రూ.36 వసూలు చేసుకొనే వెసులుబాటు కల్పించిన అధికారులు షెల్టర్లు ఏర్పాటు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. వాహనాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే అధికారులు అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి ప్యాకేజీలో అయినా పార్కింగ్ ప్రదేశంలో షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

షెల్టర్ల ఆలోచన లేకపోతే ఎలా?



ఏడాదికి ఏడాది పార్కింగ్ ఫీజులను రెట్టింపు చేస్తున్న రైల్వే అధికారులకు పార్కింగ్ ప్రదేశంలో షెడ్లు నిర్మించాలని తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. పార్కింగ్ ద్వారా లక్షల సొమ్ములు వసూలు చేస్తున్నా వాహనాల భద్రత పట్టించుకోకపోవడం సరికాదు. ఇప్పటికైనా స్పందించి తక్షణం షెల్టర్లు నిర్మించాలి. వాహనదారులు చెల్లించే సొమ్ములకు న్యాయం జరిగేలా చూడాలి.

– జి.పూర్ణానందశర్మ, అగనంపూడి

షెడ్లు నిర్మించేవరకు ఫీజు రద్దు చేయాలి



పార్కింగ్ షెడ్లు నిర్మించే వరకు పార్కింగ్ ఫీజు వసూలు నిలిపివేయాలి. రైల్వే అధికారులు ఎడాపెడా పార్కింగ్ ఫీజులు పెంచుకుపోతున్నారు. ప్రయాణికుల సౌకర్యాల కంటే ఆదాయం సముపార్జించడంపైనే అధికారులు దృష్టి సారిస్తున్నట్టు ఉంది. ఇప్పటికైనా పార్కింగ్ ఫీజులను ఏటా పెంచడం పక్కన పెట్టి, ముందుగా షెల్టర్లు నిర్మించాలి.

– డి.వ్యాసశర్మ, పెదమడక

వైభవంగా నృసింహ హోమం


నృసింహహోమం నిర్వహిస్తున్న అర్చకులు


ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ హోమం వైభవంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను అధిష్టింపజేసి పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన చేశారు. అనంతరం మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి వెళ్లి స్వామి వారి మూల విరాట్‌కు సమర్పించారు. అనంతరం ఆ పవిత్ర జలాలను భక్తులపై చల్లారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.